క్లుప్తంగా

బీసీ కుల గణనకు తీర్మానం హర్షణీయం



పూలే విగ్రహానికి క్షీరాభిషేకం చేస్తున్న బీసీ సంఘాల నాయకులు

కాకినాడ సిటీ: బీసీ కులగణనకు అసెంబ్లీ తీర్మానం చేయడంపై నగరంలో పలు బీసీ వర్గాలు హర్షం వ్యక్తం చేశారు. ఈ మేరకు బుధవారం జీజీహెచ్ వద్ద ఉన్న మహాత్మ జ్యోతి బాపూలే విగ్రహానికి క్షీరాభిషేకం చేసి హర్షం వ్యక్తంచేశారు. ఈ గణన ద్వారా బీసీలకు ఎన్ని సీట్లు ఇస్తారనేది తెలుస్తుందన్నారు. బిల్లును పార్లమెంట్ కూడా ఆమోదించి బీసీల మద్దతును ఇరు ప్రభుత్వాలు పొందాలని కోరారు. ఈ సందర్భంగా మన ప్రాంతానికి చెందిన మంత్రి శ్రీనివాస వేణుగోపాలకృష్ణ ఎంతో శ్రద్ధతో ఈ విషయాన్ని అసెంబ్లీలోకి తీసుకురావడం అభినందనీయమన్నారు. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా బీసీ ప్రజా సంక్షేమ సంఘం అధ్యక్షుడు వాసంశెట్టి రాజేశ్వరరావు, బీసీ సాయకులు కండిపల్లి వెంకటరమణ, వాసంశెట్టి త్రిమూర్తులు అనుసూరి సతీష్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు వక్తృత్వ, చిత్రలేఖన పోటీలు



విజేతలకు బహుమతులు అందజేస్తున్న అధికారులు

కాకినాడ సిటీ: ప్రపంచ పర్యాటక దినోత్సవాల్లో భాగంగా కలెక్టర్ ఆదేశాల మేరకు జిల్లా పర్యాటక, సాంస్కృతికశాఖ ఆధ్వర్యంలో ఆనందభారతిలోని రాజీవ్‌గాంధీ మున్సిపల్ పాఠశాల విద్యార్థులకు వక్తృత్వం, చిత్రలేఖనం పోటీలను బుధవారం నిర్వహించారు. విజేతలకు బహుమతులు అందజేశారు. జిల్లా పర్యాటక, సాంస్కృతికశాఖ అధికారి పి.పోశయ్య, కాకినాడ డివిజన్ ఉప విద్యాశాఖ అధికారి ఆర్‌జేడీ రాజు, ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ రాజారావు, శిల్పారామం ఏఓ టి.ప్రకాష్, వయోజన విద్యా సహాయ పథక అధికారులు, టూరిజం శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

విద్యుత్ చార్జీల పెంపుపై ఆందోళన

కాకినాడ సిటీ: పెంచిన విద్యుత్ చార్జీలను తక్షణమే తగ్గించాలని వామపక్ష పార్టీలు చేస్తున్న ఆందోళన ఉద్రిక్తమైంది. బుధవారం ఆందోళన చేస్తున్న వారిని పోలీసులు అరెస్ట్ చేసి పోలీస్ స్టేషన్లకు తరలించారు. తొలుత ఆందోళనకు అనుమతులు లేవని, ఆందోళనను విరమించాలని నచ్చజెప్పిన పట్టించుకోకుండా ఆందోళనకారులు పోలీసులను రెచ్చగొట్టేలా వ్యవహరించడంతో పోలీసులు వామపక్ష నాయకులు జె వెంకటేశ్వర్లు, ఎం.భైరవ స్వామి, తిరుమలశెట్టి నాగేశ్వరరావు, ఎం రాజశేఖర్ తదితరులను అరెస్టు చేసి పోలీసు స్టేషన్‌కు తరలించారు.

ఎస్సీ కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి శంకుస్థాపన



అంబేడ్కర్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న గీసాల శ్రీను తదితరులు

కాకినాడ రూరల్: మండలంలోని ఇంద్రపాలెంలో రూ.40 లక్షలతో నిర్మించనున్న ఎస్సీ సామాజిక భవన నిర్మాణానికి ఏఎంసీ చైర్మన్ గీసాల శ్రీను బుధవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎస్సీల చిరకాల విన్నపాన్ని ఎమ్మెల్యే కురసాల కన్నబాబు నెరవేర్చారన్నారు. రూ.40 లక్షల మంజూరుతో పాటు రూ.10 లక్షలు విడుదల చేశారన్నారు. తొలుత అంబేడ్కర్ చిత్రపటానికి ఎస్సీ నాయకులతో కలసి ఆయన నివాళులర్పించారు. దేవరాజు, మానేపల్లి జ్యోతి ప్రకాష్, బీర ప్రసాద్, శాంతి సుకుమార్ తదితరులు పాల్గొన్నారు.

చెల్లని చెక్కు కేసులో ఇద్దరికి జైలు

కాకినాడ లీగల్: చెల్లని చెక్కు ఇచ్చిన ఇద్దరికి మూడు నెలల చొప్పున జైలు, ఒక్కొక్కరికి రూ.50 వేల పరిహారం విధిస్తూ మూడో అదనపు జ్యుడీషియల్ ఫస్ట్‌క్లాస్ మేజిస్ట్రేట్ డి.శ్రీదేవి బుధవారం తీర్పు ఇచ్చారు. ప్రాసిక్యూషన్ కథనం ప్రకారం కాకినాడకు చెందిన కె.సుబ్బారెడ్డి నుంచి కాకినాడ చెందిన కేఎస్ఎస్ ప్రకాష్, ప్రత్తిపాడు చెందిన కె.అరుణశ్రీ 2019లో రూ.2 లక్షల అప్పుతీసుకున్నారు. బాకీ తీర్చేందుకు 2020లో రూ.50వేలు విలువ గల రెండు చెక్కులు ఇచ్చారు. చెక్కును సుబ్బారెడ్డి బ్యాంక్‌లో వేయగా బౌన్స్ కావడంతో కోర్టును ఆశ్రయించారు. కోర్టు విచారణలో ప్రకాష్, అరుణశ్రీపై నేరం రుజువు కావడంతో పై విధంగా న్యాయమూర్తి తీర్పు చెప్పారు.

మళ్లీ రావయ్యా గణపయ్యా..

- ఊరూ వాడా నిమజ్జనాల సందడి
- భక్తులతో సూర్యారావుపేట బీచ్ కిటకిట



కోటిపల్లి గోదావరిలోకి చేరుతున్న సిరిపురం వినాయకుడు



బై బై గణేశా... రూరల్ సూర్యారావుపేట సముద్రంలో గణపతి నిమజ్జనం

కాకినాడ రూరల్: మండలంలోని సూర్యారావుపేట బీచ్‌లో వినాయకుడు విశ్రాంతి తీసుకుంటున్నాడు. చవితి నవరాత్రులు ముగియడంతో బుధవారం నిమజ్జనాల సందడి నెలకొంది. బుధవారం ఉదయం నుంచీ వివిధ ప్రాంతాల నుంచి స్వామివారి విగ్రహాలను ఊరేగింపుగా తీసుకువచ్చి సాగరతీరంలో నిమజ్జనాలు చేస్తున్నారు. అధికారుల బందోబస్తు నడుమ ప్రశాంత వాతావరణంలో, భక్తి తత్పరతలతో కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు.

కరపలో కోలాహలంగా..

కరప: మండలంలోని వివిధ గ్రామాల్లో వినాయకులు నిమజ్జనాలకు తరలివెళ్లారు. ముందుగా ఆయా గ్రామాల్లోని వినాయక ఆలయాల వద్ద లడ్డూ ప్రసాదాలకు బహిరంగ వేలంపాట నిర్వహించారు. ప్రత్యేక పూజల నడుమ స్వామివారికి ఉద్వాసన పలికి ట్రాక్టర్లు, తొట్టిరిక్షాలు, పల్లకీలలో బ్యాండు మేళాలతో, తీన్‌మార్ వాయిద్యాలతో సందడిగా గ్రామోత్సవాలతో గొర్రిపూడి, వేళంగి, వేములవాడ గ్రామాల్లోని పవిత్ర గోదావరిపాయలైన తుల్యభాగ, చొల్లంగి వద్ద, పెనుగుదురు, పాతర్లగడ్డ గ్రామాల్లోని కెఎమ్‌జే కాలువల్లో నిమజ్జనం చేశారు. కరపలో కొత్తపేటవీధిలో బాలలు కమిటీగా ఏర్పడి తొమ్మిదేళ్లుగా చతుర్థి ఉత్సవాలు నిర్వహిస్తున్నారు. స్వామివారిని అట్టహాసంగా ఊరేగించి, పెనుగుదురులో నిమజ్జనం చేశారు. సిరిపురంలో వినాయకుడిని కోటిపల్లి తీసుకెళ్లి గోదావరిలో నిమజ్జనం చేశారు. సీఐ కె.శ్రీనివాస్ పర్యవేక్షణలో ఎస్ఐ ఎన్.రామకృష్ణ, ఏఎస్సైలు ఎ.ప్రసన్నకుమార్, వి.సూరిబాబు బందోబస్తు నిర్వహించారు.



కరపలో వినాయకుడిని సందడిగా తీసుకువెళ్తున్న మహిళలు



రమణయ్యపేట గోకుల్ గార్డెన్ నుంచి గణపతి ఊరేగింపులో యువతులు, భక్తుల సందడి

చాలా సంతోషంగా ఉంది



రమణయ్యపేట గోకుల్ గార్డెన్ వద్ద వినాయక విగ్రహం ఏర్పాటు చేసి నవ రాత్రులను భక్తి శ్రద్ధలతో చేసి పూజించాం. నిమజ్జంలో మహిళలం అందరం పాల్గొన్నాం. చాలా సంతోషంగా ఉంది.

– రాజ్యలక్ష్మి, భక్తురాలు, గోకుల్ గార్డెన్, రమణయ్యపేట

బీచ్‌లో ఏర్పాట్లు బాగా చేశారు



గణేష్ విగ్రహాల నిమజ్జనానికి సూర్యారావుపేట బీచ్‌లో ఏర్పాట్లు బాగా చేశారు. ట్రాఫిక్ రద్దీ లేదు. ఒకటి తరువాత చొప్పున విగ్రహాలను నిమజ్జనాలకు అనుమతించడంతో అందరూ వెళ్ళి సముద్రంలో గణపతిని సాగనంపి స్నానాలు చేస్తున్నారు. రక్షణ చర్యలు, బందోబస్తు, ఏర్పాట్లు బాగునున్నాయి.

– గన్ని సూర్య రాఘవేంద్రరావు, రమణయ్యపేట

కన్న కొడుకులా ఆదుకుంటున్నారు

- ముఖ్యమంత్రి జగన్‌కు రుణపడి ఉంటాం
- పింఛన్లతో ప్రతి కుటుంబానికీ అండగా నిలుస్తున్నారని లబ్ధిదారుల హర్షాతిరేకాలు

కరప: పేదల జీవితాల్లో వైఎస్సార్ పింఛన్ కానుక వెలుగులు నింపుతోంది. పస్తులతో బతుకే తమలాంటి వారికి ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి అధికారంలోకి వచ్చాక నెలవారీ పింఛన్‌తో కడుపు నింపుకొంటున్నామని వృద్ధులు, మహిళలు హర్షాతిరేకాలు వ్యక్తం చేస్తున్నారు.

టీడీపీ ప్రభుత్వం హయాంలో పింఛన్లు ఎలాతగ్గించాలో ఆలోచించేవారని, అదీ కూడా అర్హత ఉన్నా, ఆ పార్టీ నాయకుల సిఫార్సు చేస్తేనే పింఛన్ దక్కేదని, ఆ పింఛన్ కోసం అప్పటి జన్మభూమి కమిటీల చుట్టూ, కార్యాలయాల చుట్టూ ప్రదక్షిణలు చేయాల్సి వచ్చేదని నాలుగేళ్ల క్రితం వరకు తమకు ఎదురైన చేదు అనుభవాలను, పడినబాధలను వృద్ధులు, మహిళలు, దివ్యాంగులు గుర్తు చేసుకుంటున్నారు. నేటి ప్రభుత్వంలో ఆ సమస్యలు లేవని, సీఎం జగన్ సచివాలయ వ్యవస్థను ఏర్పరచి, వలంటీర్ల ద్వారా విప్లవాత్మకమైన మార్పులు తీసుకువచ్చి వారికి కేటాయించిన 50 ఇళ్ల ప్రజల బాగోగులు చూస్తున్నారని, ఈ క్రమంలో ఎవరికి ఏ పింఛను ఇవ్వాలో నిర్ణయించి వారితో దరఖాస్తులు చేయించి మంజూరు చేయించి ఒకటో తారీఖు తెల్లవారక ముందే లబ్ధిదారుల చేతుల్లో పెడుతున్నారని వారంతా ఆనందం వ్యక్తం చేస్తున్నారు.



కరపలో కొత్త పింఛన్లు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే కన్నబాబు (ఫైల్)

కొత్తగా 554 పింఛన్లు మంజూరు



మండల పరిధిలో ఈ ఏడాది కొత్తగా 554 మందికి పింఛన్లు మంజూరైనట్టు ఎంపీడీఓ కె.అప్పారావు తెలిపారు. వీటిలో వృద్ధాప్య, చేనేత, మత్స్యకార, ఒంటరి మహిళ, వితంతువు, దివ్యాంగులు, కల్లుగీత కార్మికులు, డప్పు కళాకారులు తదితరులకు కొత్త పింఛన్లు మంజూరు అయ్యాయన్నారు. కొత్తపింఛన్లతో కలిపి మండలంలో 11,713 మందికి రూ.3,19,67,750 అందజేస్తున్నాం.

– కె.అప్పారావు, ఎంపీడీఓ, కరప మండలం

ముఖ్యమంత్రి మేలు మరవలేను



ఏ ఆధారం లేక బాధపడుతుంటే వలంటీర్ ఇంటికి వచ్చి సంతకం చేయించుకుని, దరఖాస్తు చేయించారు. ఈ నెలలో పింఛన్ మంజూరైందని ఇంటికి డబ్బులు తీసుకొచ్చి చేతిలో పెట్టారు. ముఖ్యమంత్రి జగన్ మేలు మరువలేను. ఎప్పటికీ ఆయనే ముఖ్యమంత్రిగా ఉండాలి.

– శ్రీపాదం సత్యనారాయణమ్మ, వేములవాడ

పింఛన్ వస్తుందనుకోలేదు



కల్లుగీత కార్మికునిగా జీవిస్తున్నాను. సీజనల్‌గా వచ్చే ఆదాయం సరిపోక కుటుంబ పోషణ కష్టంగా మారింది. వలంటీర్ వచ్చి దరఖాస్తు చేయించారు. పింఛన్ వస్తుందన్న నమ్మకం లేదు, రెండు వారాల క్రితం పింఛన్ వచ్చిందంటూ రూ.2,750 చేతిలో పెట్టారు.

– పలివెల కొండ, కల్లుగీత కార్మికుడు, యండమూరు

పారిశుధ్య కార్మికుల సేవలు అభినందనీయం



క్లాప్ మిత్రలతో కాఫీ తాగుతున్న డీఎల్‌పీఓ అన్నామణి తదితరులు

కరప: పారిశుధ్య కార్మికుల సేవలు అభినందనీయమని డీఎల్‌పీఓ అన్నామణి అన్నారు. క్లాప్ మిత్రాలకు క్రమం తప్పకుండా వైద్యపరీక్షలు నిర్వహించాలని, ప్రభుత్వ పథకాలు వారికి అందేలా చర్యలు తీసుకోవాలని ఆమె సూచించారు. స్థానిక ఎస్‌డబ్ల్యూసీ కేంద్రం వద్ద బుధవారం కాఫీ విత్ క్లాప్‌మిత్ర కార్యక్రమాన్ని నిర్వహించి వారితో కాఫీ తాగారు. అనంతరం వారికి వైద్య పరీక్షలు చేయించారు. అనంతరం పారిశుధ్య కార్మికులను సర్పంచ్ సాదే ఆశాజ్యోతితో కల్సి సత్కరించారు. ఈఓపీఆర్డీ ఎస్‌వీ శ్రీనివాసరావు, కార్యదర్శి ఎస్‌కే నాగేంద్రకుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

విధుల్లోకి ఏఎంవీఐ చిన్నారావు



జిల్లా రవాణాశాఖాధికారి మోహన్‌ను కలసిన ఏఎంవీఐ చిన్నారావు

బాలాజీచెరువు (కాకినాడ సిటీ): ఈ ఏడాది మార్చి 17న విధి నిర్వహణలో ఉండగా కొబ్బరిబొండాల వ్యాపారి చేతిలో కత్తిదాడికి గురైన అసిస్టెంట్ ఎంవీఐ ఎం.చిన్నారావు కోలుకుని గురువారం తిరిగి విధుల్లో చేరారు. ఈ సందర్భంగా ఆయన జిల్లా రవాణా అధికారి మోహన్‌ను మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. అంతకు ముందు ఎస్పీ సతీష్‌కుమార్, డీఎస్పీ మురళీకృష్ణారెడ్డిని ఆయన కలసి అభినందనలు తెలిపారు.

ఎక్స్‌ప్రెస్ రైళ్లలో బోగీలు పెంచాలి

కాకినాడ సిటీ: ఎక్స్‌ప్రెస్ రైళ్లలో జనరల్ బోగీలు, స్లీపర్ క్లాస్ బోగీలు పెంచాలన్న డిమాండ్లతో సీపీఎం ఆధ్వర్యంలో మంగళవారం కాకినాడ టౌన్ రైల్వే స్టేషన్ వద్ద ధర్నా చేశారు. బీజేపీ 2014లో అధికారం చేపట్టిన తరువాత రైల్వే బడ్జెట్ లేకుండా చేశారన్నారు. కాకినాడ–పిఠాపురం రైల్వే మెయిన్‌లైన్ కలపాలన్నారు. సీపీఎం నాయకులు పలివెల వీరబాబు, కె సత్తిరాజు, చెక్కల రాజ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

పర్యాటకాభివృద్ధితో ఉపాధి అవకాశాలు

- కస్టమ్స్ డిప్యూటీ కమిషనర్ విజయ్‌కుమార్
- ఘనంగా ప్రపంచ పర్యాటక దినోత్సవం

కాకినాడ సిటీ: స్వచ్ఛతా పఖ్వాడాలో భాగంగా ప్రపంచ పర్యాటక దినోత్సవాన్ని పురస్కరించుకుని కస్టమ్స్ శాఖ ఆధ్వర్యంలో స్వచ్ఛతా హి సేవను గాంధీభవన్‌లో బుధవారం నిర్వహించారు. కస్టమ్స్ హౌస్ డిప్యూటీ కమిషనర్ కె.విజయకుమార్ సారథ్యంలో కస్టమ్స్ ఉద్యోగులు గాంధీభవన్ పరిసరాలను శుభ్రపరిచారు. కమిషనర్ మాట్లాడుతూ ఈ ఏడాది టూరిజం అండ్ గ్రీన్ ఇన్వెస్ట్‌మెంట్ నినాదంతో ప్రపంచ పర్యాటక దినోత్సవాన్ని నిర్వహిస్తున్నామని, టూరిజం ప్రాంతాలను పరిశుభ్రంగా ఉంచడంతో పాటు పర్యాటకులను ఆకర్షించే విధంగా తీర్చిదిద్దితే జీవనోపాధులు లభిస్తాయన్నారు. అసిస్టెంట్ కమిషనర్ సీహెచ్‌వీ వెంకటరెడ్డి మాట్లాడుతూ పర్యాటకులను ఆకర్షించేందుకు చారిత్రాత్మకమైన ప్రదేశాల్లో పర్యాటక దినోత్సవం జరుగుతుందన్నారు. కస్టమ్స్ డివిజన్ సూపరింటెండెంట్ సతీష్‌సింగ్ మాట్లాడుతూ నగర పరిసర ప్రాంతాలలో, సామాజిక ప్రదేశాల్లో స్వచ్ఛతా హీ సేవలను కస్టమ్స్ ఉద్యోగులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. గాంధీభవన్ కార్యదర్శి వైఎస్‌వీఎస్ మూర్తి, కస్టమ్స్ శాఖ అధికారులు, గాంధీభవన్ కార్యక్రమాల సమన్వయ కర్త అల్లూరి సురేంద్ర పాల్గొన్నారు.



గాంధీ విగ్రహం వద్ద కస్టమ్స్ అధికారులు

తీరంలో మృత డాల్ఫిన్

కొత్తపల్లి: మండలంలోని ఉప్పాడ శివారు ఎస్పీజీఎల్ విద్యుత్ కర్మాగారం సమీపంలోని తీర ప్రాంతానికి బుధవారం మృతి చెందిన డాల్ఫిన్ కొట్టుకొచ్చింది. మత్స్యకారుల సమాచారంతో అధికారులు డాల్ఫిన్‌ను పరిశీలించారు. కాకినాడ అటవీశాఖ రేంజర్, జంతుసంరక్షణ అధికారి వరప్రసాద్ పర్యవేక్షణలో డాల్ఫిన్‌కు పంచనామా చేశారు. గురువారం వివిధ శాఖల పర్యవేక్షణలో పశు సంవర్ధక అధికారి పోస్టుమార్టం చేయనున్నారు. సుమారు రెండేళ్ల వయసు, 5.5 అడుగుల పొడవు , 45 కిలోల బరువు ఉండవచ్చన్నారు. ఎస్సై స్వామినాయుడు, మత్స్యశాఖ అధికారి శ్రీరామకృష్ణ, రెవెన్యూ సిబ్బంది డాల్ఫిన్ వచ్చిన ప్రదేశాన్ని పరిశీలించారు.



డాల్ఫిన్‌ను పరిశీలిస్తున్న అధికారులు

ఎలుకలను సామూహికంగా నిర్మూలించాలి

కరప: సార్వాలో వరి పంటపై ఎలుకల బెడద ఉందని, ఎలుకల నివారణకు రైతులందరూ సామూహికంగా చర్యలు చేపడితేనే ఫలితముంటుందని జిల్లా వనరుల కేంద్రం అసిస్టెంట్ డైరెక్టర్ వి.మాధవి అన్నారు. మండలం గొర్రిపూడిలో బుధవారం ఆమె సామూహిక ఎలుకల నివారణ కార్యక్రమాన్ని ప్రారంభించి, రైతులకు సూచనలు చేశారు. ఎలుకల నివారణకు ప్రభుత్వం వ్యవసాయశాఖ ద్వారా బ్రోమోడయోలిన్ మందును ఉచితంగా సరఫరా చేస్తోందన్నారు. సబ్‌డివిజన్ ఏడీఏ కె.బాబూరావుతో కల్సి ఆమె రైతులకు ఎలుకల మందును పంపిణీ చేశారు. మండల వ్యవసాయాధికారి ఏవీ రాజేష్ కొరిపల్లి, జెడ్.భావారం, కరప తదితర గ్రామాల్లో పర్యటించి, ఆర్బీకేల వద్ద రైతులతో ఏర్పాటు చేసిన సమావేశాల్లో ఎలుకల నివారణపై అవగాహన కల్పించి, బ్రోమోడయోలిన్ మందును ఉచితంగా పంపిణీ చేశారు. మండలానికి 65 కిలోల బ్రోమోడయోలిన్ మందు వచ్చిందని, అన్ని గ్రామాల్లోని ఆర్బీకేల వద్ద వీఏఏల ద్వారా రైతులకు మందును పంపిణీ చేసినట్టు ఎంఏఓ రాజేష్ తెలిపారు.

రూరల్ మండలంలో..

కాకినాడ రూరల్: వరిచేలలో సామూహిక ఎలుకల నిర్మూలనను బుధవారం మండల వ్యవసాయశాఖ అధికారులు చేపట్టారు. మండల పరిధిలో 13 ఆర్బీకేలలో గ్రామ వ్యవసాయ సహాయకులు, రైతులతో కలసి వరి పొలాల్లో సామూహిక ఎలుకల నిర్మూలన చేపట్టారు. నేమాం గ్రామంలో ఏఓ చిగకట్ల సత్యనారాయణ మాట్లాడుతూ మండలంలో 13 ఆర్బీకేల పరిధిలో రైతులకు రూ.57500 విలువైన 23 కిలోల బ్రోమోడయోలిన్ మందును ఉచితంగా పంపిణీ చేశామన్నారు. కార్యక్రమంలో అగ్రికల్చర్ అసిస్టెంట్ దైవ ప్రసన్న పాల్ తదితరులు పాల్గొన్నారు.



గొర్రిపూడిలో ఎలుకల నివారణ మందు ప్రయోగాత్మకంగా కలిపి చూపుతున్న వ్యవసాయాధికారులు

చట్టం ఎవరికీ చుట్టం కాదు

- చంద్రబాబు కోసం చేస్తున్న ఆందోళనలు కృత్రిమమే
- యువ కాపునాడు జాతీయ కార్యదర్శి రవి

బోట్‌క్లబ్ (కాకినాడసిటీ): చట్టం ఎవరికీ చుట్టం కాదని, చట్టానికి చంద్రబాబునాయుడు అతీతుడు కాదని యువ కాపునాడు జాతీయ కార్యదర్శి లింగం రవి అన్నారు. కాకినాడలోని ఒక హోటల్‌లో బుధవారం యువ కాపునాడు నాయకులు విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. ఎవరైనా చేసిన పాపం ఊరికే పోదన్నారు. కాపు ఉద్యమ నాయకుడు ముద్రగడ్డ పద్మనాభంను రోడ్డుకీడ్చిన రోజులు, కాపు యువతని కోర్టుల చుట్టూ అన్యాయంగా తిప్పించిన రోజులు ఊరికే పోవన్నారు. ప్రస్తుతం ఆయన జైలుకు వెళ్లగానే ఎందుకు గగ్గోలు పెడుతున్నారన్నారు. తప్పుచేసి జైల్లో కూర్చున్న చంద్రబాబు కోసం ఒక సామాజిక వర్గం మాత్రమే కృత్రిమ ఉద్యమాలు చేస్తూ ప్రజలను మభ్యపెడుతోందన్నారు. ధర్నాలు చేస్తూ లేనిపోని కుల రాజకీయాలు చేయవద్దని హితవు పలికారు. ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి అన్ని కులాలకు న్యాయం చేశారని, రాబోయే రోజుల్లో కూడా యువ కాపునాడు ఆయన వెంటే ఉంటుందన్నారు. యువకాపునాడు ఆధ్వర్యంలో రాష్ట్రంలోని అన్ని ప్రాంతాలు తిరిగి కాపునాయకులను ఒకే తాటిపైకి తీసుకువస్తామన్నారు. త్వరలో రాజమహేంద్రవరం రూరల్‌లో యువ కాపునాడు భారీ బహిరంగ సభ ఏర్పాటు చేసేందుకు సన్నాహాలు చేస్తున్నామన్నారు. ఈ సమావేశంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ముత్యాల పోసికుమార్, సాంస్కృతిక విభాగం రీజనల్ కో ఆర్డినేటర్ నాగులాపల్లి ఆశ పాల్గొన్నారు.



విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న రవి

ప్రజారోగ్య పరిరక్షణకు పరస్పర సహకారం

- జీజీహెచ్ సూపరింటెండెంట్‌ను కలిసిన డీఐవో
- ఇరువురి అధికారుల మధ్య కీలక అంశాల చర్చ



జీజీహెచ్ సూపరింటెండెంట్ లావణ్యకుమారిని అభినందిస్తున్న రత్నకుమార్

కాకినాడ క్రైం: ప్రజారోగ్య పరిరక్షణకు పరస్పర సహకారంతో ముందుకు వెళ్లాలని వైద్య, ఆరోగ్య విభాగాల కీలక అధికారులు తీర్మానించారు. ఇటీవల కాకినాడ జీజీహెచ్ సూపరింటెండెంట్‌గా బాధ్యతలు స్వీకరించిన డాక్టర్ లావణ్యకుమారిని న్యూరో మెడిసిన్ నిపుణుడు, జిల్లా వ్యాధి నిరోధక టీకాల అధికారి (డీఐవో) డాక్టర్ కన్నీడి రత్నకుమార్ బుధవారం ఆసుపత్రిలోని ఆమె చాంబర్‌లో కలసి అభినందించారు. భావితరాల భద్రతకు ప్రభుత్వం టీకాల పంపిణీని కట్టుదిట్టంగా చేపడుతోందని డాక్టర్ రత్నకుమార్ ఆమెకు వివరించారు. జిల్లా వ్యాప్తంగా టీకాల పంపిణీ, నిర్వహణను క్షేత్రస్థాయి సిబ్బంది, అధికారుల సహకారంతో ప్రణాళికాబద్ధంగా చేపడుతున్నట్లు తెలిపారు. టీకాల పంపిణీ విజయవంతానికి జీజీహెచ్ అత్యంత కీలకమని అన్నారు. రోగులకు టీకాల ప్రాధాన్యంపై అవగాహన కల్పించి తమ విభాగానికి సహకరించాలని కోరారు. డాక్టర్ లావణ్యకుమారి మాట్లాడుతూ, పేద, నిరుపేద వర్గాల ఆరోగ్య ప్రయోజనాల కోసం చేపడుతున్న కార్యక్రమాలకు తన వంతు సహకారం అందిస్తానని ఆయనకు తెలిపారు.

ఓపీ సేవల్లో మేము సైతం..

కాకినాడ క్రైం: ఆయుష్మాన్ భారత్‌లో భాగంగా జరుగుతున్న సాంకేతిక అనుసంధాన ఓపీ నమోదు ప్రక్రియకు కృష్ణ కన్‌స్ట్రక్షన్స్ అధినేత గోకెడ రాంబాబు తన వంతు సహకారాన్ని అందించారు. ఓపీ ప్రక్రియ మరింత వేగవంతంగా కొనసాగడానికి తన వంతుగా ముగ్గురు ఆపరేటర్లను జీజీహెచ్‌లో నియమించారు. అలాగే, ఆపరేటర్ల అందరి సౌలభ్యం కోసం టూ టన్ సామర్థ్యం ఉన్న ఏసీని అందజేశారు. ఈ సేవలను జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ లావణ్యకుమారి బుధవారం ప్రారంభించారు. వీరి జీతభత్యాల బాధ్యత రాంబాబు భరించనుండడం ఆదర్శనీయం అన్నారు. అనంతరం డాక్టర్ లావణ్యకుమారి ఓపీ విభాగాల్లో పర్యటించి రోగులకు అందుతున్న సేవలపై ఆరా తీశారు.



ఓపీ విభాగంలో నూతన ఏసీని ప్రారంభిస్తున్న డాక్టర్ లావణ్యకుమారి

బ్యాంకుఖాతా సీజ్‌పై రైతుల ఆగ్రహం

కరప పీఏసీఎస్‌లో మహాజనసభ

కరప: స్థానిక పీఏసీఎస్ కార్యాలయంలో బుధవారం మహాజన సభ నిర్వహించారు. ఇన్‌చార్జి సీఈఓ ఆర్.వెంకటేశ్వరరావు మాట్లాడుతూ సంఘ పరిధిలో ఉన్న 1,445 మంది రైతులకు రూ.5,86,29,141 రుణాలు ఇచ్చినట్టు తెలిపారు. గత ఆర్థిక సంవత్సరంలో సొసైటీకి రూ.14.4 లక్షల లాభాలు వచ్చినట్టు తెలిపారు. సొసైటీ నుంచి కట్టాలంటున్న రూ.3.98 లక్షల ఆదాయ పన్నును ఎవరు చెల్లిస్తారని రైతులు బేరి రామకృష్ణ, రెడ్డి వీరభద్రరావు ప్రశ్నించారు. అలాగే రుణాల మంజూరుపై కొంతసేపు వాగ్వాదాలు జరిగాయి. పీఏసీఎస్ ప్రత్యేకాధికారి, కాకినాడ సబ్‌డివిజనల్ సీనియర్ ఇన్‌స్పెక్టర్ ఎం.గణేష్‌కుమార్ మాట్లాడుతూ 2019–20 ఆర్థిక సంవత్సరంలో రూ.4,51,49,075 జరిగిన టర్నోవర్‌పై విధించిన ఆదాయ పన్నుపై ఆడిటర్ సూచనల మేరకు అప్పీలుకు వెళ్లామని, ఆ సమయంలోనే ఆ శాఖ అధికారులు సెక్షన్ 226 కింద నోటీసు ఇచ్చి, పీఏసీఎస్ బ్యాంక్‌ఖాతాను స్తంభింప చేశారన్నారు. దీనిపై విశాఖలోని ప్రిన్సిపల్ కమిషనర్‌కు అపీలు చేయగా ఖాతా తెరవాలంటే రూ.5 లక్షలు చెల్లించాలని ఆదేశించారని, దీంతో అడ్వాన్స్ చెక్కు ఇచ్చామని వివరించారు. తొలుత ఇటీవల మృతి చెందిన పీఏసీఎస్ సీఈఓ చోడపునీడి మంగతాయారుకు సంతాపం తెలిపారు. మాజీ చైర్మన్ నక్కా వీరభద్రరావు, మాజీ సీఈఓ సీహెచ్ వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.



మహాజనసభలో మాట్లాడుతున్న ప్రత్యేకాధికారి గణేష్‌కుమార్